సాక్షి ఖమ్మం

శనివారం ׀ 8 ׀ ఫిబ్రవరి ׀ 2025



పాలనను గాడిన పెట్టేలా..

కేఎంసీలో అస్తవ్యస్తంగా మారిన పాలనను గాడిన పెట్టేలా కమిషనర్ అభిషేక్ అన్ని విభాగాలను నేరుగా పరిశీలిస్తున్నారు. 8లో



'అపార్'మైన ఆలస్యం

విద్యార్థులకు 'అపార్' పేరిట ప్రత్యేక నంబర్ కేటాయించేందుకు చేపట్టిన వివరాల నమోదు గడువు ముగిసినా జిల్లాలో పూర్తికాలేదు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 19°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30 గంటలకు ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొంటారు. అలాగే, ఖమ్మం, బల్లేపల్లి తదితర ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలకు హాజరవుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12–30గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో స్థానికులు, పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు.

క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులైన వారు ఏడాది క్లినికల్ అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇచ్చే శిక్షణకు ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా ఫారం, సర్టిఫికెట్ల జిరాక్స్‌లకు రూ.10 పోస్టల్ స్టాంప్‌తో కూడిన సొంత చిరునామా కవర్ జతపరిచి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 15లోగా అందజేయాలని తెలిపారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే కీలకం



ఫెన్సింగ్ నిర్మాణానికి భూమిపూజ చేసిన జీఎం, అధికారులు

సత్తుపల్లి: ఆర్థిక సంవత్సరం ముగియడానికి తక్కువ సమయం ఉన్నందున సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీకి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషిచేయాలని, ఇదే సమయాన రక్షణ చర్యలు పాటించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు సూచించారు. సత్తుపల్లి అర్బన్‌పార్క్ చుట్టూ సింగరేణి నిధులు రూ.కోటితో ఫెన్సింగ్ నిర్మాణానికి శుక్రవారం రేంజర్ స్నేహలతతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, జేవీఆర్ ఓసీలో రూ.10లక్షల వ్యయంతో ఏర్పాటుచేసి న వాహనాల బ్యాటరీ చార్జింగ్ రూమ్, డిస్పెన్సరీలో రూ.36 లక్షల వ్యయంతో సమకూర్చిన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించారు. సత్తుపల్లిలో పని చేసే సింగరేణి ఉద్యోగులు ఎక్స్‌రే కోసం కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండటంతో ఇక్కడే యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, ఏజీఎం సీహెచ్.రామకృష్ణ, ఇంజనీర్ శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీలు నర్సింహారావు, రామారావు, ఉద్యోగులు దేవదాసు, రవికుమార్, నవీన్, రవీందర్‌తో పాటు సంఘాల నాయకులు సముద్రాల సుధాకర్, ఎండీ.రజాక్ పాల్గొన్నారు.

జీళ్లచెరువు ఆలయాభివృద్ధికి రూ.2.60కోట్లు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.2.60కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్థానికుల వినతితో పాలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నిధులు మంజూరు చేయించారు. గుట్టపైకి వెళ్లేందుకు రెండు వరుసల బీటీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణంతోపాటు గుట్టపై ప్లాట్‌ఫాం, కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు.

అటవీ సంరక్షణలో భాగం పంచుకోవాలి



విద్యార్థినులతో డీఎఫ్ఓ సిద్ధార్థ్, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలోని అటవీశాఖ కార్యాలయం నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం హరిత సైనికులతో సమావేశం నిర్వహించారు. ఖమ్మం ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొనగా కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరు, అటవీశాఖలో ఉద్యోగాలకు సిద్ధం కావాల్సిన విధానం, అటవీ చట్టాలు, అడవుల ప్రాధాన్యతను అధికారులు వివరించారు. ఈ అంశంపై డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ మాట్లాడగా అటవీ సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. ఎఫ్ఆర్ఓలు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్యామలాదేవి, రాంకుమార్‌స్వామి, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

కోయచెలకలో 30రోజులకే పొట్ట దశకు వచ్చిన వరి



పెనుబల్లిలో చనిపోయిన కోళ్లను పరిశీలిస్తున్న ఉద్యోగులు (ఫైల్)



మామిడి మొక్కకు అరకొరగా ఉన్న పూత, పిందె



అన్నింటా ఎత్తుపల్లాలే..

వాతావరణంలో మార్పులు.. వైరస్ పోటు

- మిక్స్‌డ్ వైరస్‌తో వేలాది కోళ్ల మృత్యువాత
- మంచుతో రాలుతున్న మామిడి పూత
- మరోపక్క ముందే ఈనుతున్న వరి

వాతావరణంలో వస్తున్న మార్పులు పంటలకు చేటు చేస్తున్నాయి. ఆ ప్రభావంతో వైరస్‌లు కూడా పుట్టుకొస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులతో పంటల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి తోడు విత్తనలోపం దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వరిలో విత్తన రకానికి అనుగుణంగా నిర్దేశిత సమయానికి ముందు కంకులు వస్తున్నాయి. మరోవైపు వైరస్‌లు జీవాలపై ప్రతాపాన్ని చూపుతున్నాయి. వెరసి చాలాచోట్ల వరి తీవ్రంగా దెబ్బతినగా.. మామిడితోటల్లో పూత రాలుతోంది. మరోపక్క వేలాది కోళ్లు మృత్యువాత పడుతుండడానికి వాతావరణంలో అసమతుల్యతలే కారణమని తెలుస్తోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ముందే పొట్ట దశకు..

యాసంగిలో పలువురు రైతులు సాగు చేసిన వరి పదిహేను రోజుల్లో పొట్ట దశకు చేరడం మొదలైంది. దీంతో రైతులకు తీరని నష్టం ఎదురుకాగా నకిలీ విత్తనాలుగా వారు చెబుతున్నారు. జిల్లాలోని రఘునాథపాలెం, సత్తుపల్లి, నేలకొండపల్లి తదితర మండలాల్లో ఈ ప్రభావం ఉంది. శాస్త్రవేత్తలు మాత్రం వాతావరణంలో మార్పులతో కూడా ఇలా జరుగుతుందని చెబుతున్నా పూర్తిస్థాయిలో కారణాలు మాత్రం తేలలేదు. ఉదయం మంచు కురుస్తుండడం, మధ్యాహ్నానికి ఎండ తీవ్రమవుతుండడంతో మొక్కలు తట్టుకునే పరిస్థితి లేదని తెలుస్తోంది. కారణాలు ఏమైనా జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో వరి దెబ్బతినగా వైరాలోని కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

అలాగే, మామిడి తోటల్లోనూ పూత రాలిపోతోంది. తోటల్లో ఇప్పుడిప్పుడే పూత, పిందె వస్తుండగా మంచు కారణంగా ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి.

విపరీతమైన మార్పులు

శీతాకాలం చివరి దశకు చేరగా వారం నుంచి ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటోంది. ఆతర్వాత మధ్యాహ్నం మాత్రం వేసవిని తలపించేలా ఎండ నమోదవుతోంది. ఇలా ఉదయం, పగలు, రాత్రి సమయాల్లో చలి, ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ అసమతుల్యత ఇటు పంటల దిగుబడి, అటు జీవాల ఆరోగ్యంపై పడుతోంది.

మండే ఎండ

సహజంగా మార్చి నుంచి వేసవి ప్రారంభమవుతుంది. అయితే ఈసారి ఫిబ్రవరిలోనే వేసవి మాదిరి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం గమనార్హం. శుక్రవారం జిల్లాలో గరిష్టంగా 36 డిగ్రీలు, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈనెల ప్రారంభం నుంచి సగటున 33 – 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటోంది. జనవరి నెలాఖరులో గరిష్టంగా 30, కనిష్ట ఉష్ణోగ్రత 16 – 19 డిగ్రీలుగా నమోదైంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా వ్యత్యాసం ఉండడం కూడా పంటలు దెబ్బతినడానికి కారణంగా తెలుస్తోంది.

ఏపీ నుంచి వ్యాప్తి

ఇటీవల పలు ప్రాంతాల ఫామ్‌ల్లోని కోళ్లు చనిపోతున్నాయి. పెనుబల్లి మండలంలో రెండు ఫామ్‌ల్లో 10వేలు, కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో 50 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి .గాలి నుంచి సోకిన వైరస్ కారణంగా ఇలా జరుగుతోందని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఈ మండలాల్లోని కోళ్ల ఫారాలకు ఏపీలోని ఫారాల నుంచి వైరస్ వ్యాప్తి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీన్ని మిక్స్‌డ్ వైరస్ ఆర్‌డీ(కొక్కెర రోగం)గా భావిస్తున్నారు. ఇప్పటికే చనిపోయిన కోళ్ల నుంచి సేకరించిన నమూనాలను హైదరాబాద్‌లోని పశుసంవర్థక శాఖ ల్యాబ్‌కి పంపినందున నివేదిక అందిస్తే స్పష్టత రానుంది. ముందస్తుగా ఏపీ సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటుచేసి దాణా, కోళ్ల దిగుమతి జరగకుండా అడ్డుకుంటున్నారు.

చెక్‌పోస్ట్‌తో కట్టడి



మిక్స్‌డ్ వైరస్ ఆర్‌డీ(కొక్కెర రోగం) ప్రభావంతో కోళ్లు చనిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. ఏపీ పరిసరాల నుంచి వైరస్ వ్యాప్తి చెందినట్లు తేలడంతో తిరువూరులో చెక్‌పోస్ట్ పెట్టి దాణా, కోళ్లు రాకుండా కట్టడి చేస్తున్నాం. 25 రోజుల వయసు కలిగిన బాయిలర్ కోళ్లకు వైరస్ సోకడానికి ఫారంల్లో నిర్వహణ లోపం కూడా ఓ కారణమే.

– కె.వెంకటనారాయణ, జిల్లా పశు సంవర్థక అధికారి

విత్తనలోపం, వాతావరణ మార్పుతోనే..



జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగుచేసిన వరి ముందస్తుగా కంకి దశకు చేరింది. సత్తుపల్లి, ఖమ్మం వ్యవసాయ డివిజన్లలో ఈ ప్రభావం అధికంగాఉంది. విత్తనలోపానికి తోడు వాతావరణంలో మార్పులే ఇందుకు కారణం. కేవీకే శాస్త్రవేత్తలతో పాటు అధికారులు ఇప్పటికే పొలాలను పరిశీలించారు. ఆయా బృందాలు ఇచ్చే నివేదికల ఆధారంగా ముందుకు సాగుతాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పులిగుండాలలో చిరుత సంచారం

పెనుబల్లి: పెనుబల్లి మండలం తాళ్లపెంట – పులిగుండాల అటవీ ప్రాంతాల చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. బ్రహ్మళకుంట అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న మామిడి తోట, పత్తి చేలలో పులి అడుగుల మాదిరి కనిపించడంతో తోట కాపలాదారుడు సీతారాములు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అధికారులు శుక్రవారం పరిశీలించి చిరుత పాదముద్రలుగా నిర్ధారించారు. ఈమేరకు తల్లాడ ఫారెస్టు రేంజ్ అధికారి జి.ఉమ, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ మాట్లాడుతూ చిరుతపులి సంచరిస్తున్నందున పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానికులకు చిరుతపులి ఆనవాళ్లు తెలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలే తప్ప హానీ కలిగించొద్దని అధికారులు సూచించారు. కాగా, కొద్దిరోజులుగా పులిగుండాల ప్రాజెక్టు వద్దకు వివిధ పాఠశాలల విద్యార్థులను వనదర్శిని పేరిట తీసుకొస్తున్నారు. ప్రస్తుతం చిరుతపులి సంచారాన్ని గుర్తించడంతో విద్యార్థుల పర్యటనలను రద్దుచేశారు.

11న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా

ఖమ్మంవన్‌టౌన్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందనే ప్రచారం జరుగుతుండగా, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి శుక్రవారం ఆదేశాలు విడుదలయ్యాయి. ఈమేరకు అధికారులు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్న పోలింగ్ స్టేషన్ల భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ జాబితాను 11వ తేదీన అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 11నుంచి 13వ తేదీ వరకు ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. అలాగే, 13వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడమే కాక 14వ తేదీన అందిన అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. చివరగా 15వ తేదీన జిల్లాలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ల తుది జాబితా వెల్లడిస్తారు. కాగా, గతంలో జిల్లావ్యాప్తంగా 1,6,15 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఈసారి హెచ్చుతగ్గులు నమోదయ్యే అవకాశముంది.

విద్యార్థులు అభ్యసన స్థాయిలో పురోగతి

- ఉపాధ్యాయుల లక్ష్యం ఇదే కావాలి..
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన అధికారులు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన స్థాయిలో నాణ్యతాపరమైన పురోగతి సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమావేశమైన ఆయన పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత, విద్యాశాఖ కార్యకలాపాలపై సమీక్షించారు. ప్రైవేట్ కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రుల్లో కల్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఈమేరకు బోధనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం మాత్రమే తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే, పాఠశాలకు నిత్యం హాజరయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందస్తుగా సిద్ధం కండి

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్నందున శాంతియుత వాతావరణంలో జరిగేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికలు పూర్తయ్యేలా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల వారీగా బందోబస్తుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, సాధారణ, సమస్మాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఎన్నికల సంబంధిత నేరచరిత్ర ఉన్న వారు, రౌడీషీటర్ల నడవడికపై దృష్టి సారించాలని చెప్పారు. అలాగే, కేసుల విచారణ, చార్జీషీట్ల దాఖలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, తద్వారా నిందితులకు శిక్ష పడుతుందని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీలు వెంకటేష్, సాంబరాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టాలెక్కిన పనులు



లైన్ల మధ్య ఇంటర్ లాకింగ్

- చకచకా మూడో లైన్ నిర్మాణం
- జూన్ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ
- ప్రస్తుతం ఖమ్మం సమీపాన ఇంటర్ లాకింగ్ పనులు

ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొండపల్లి నుంచి కాజీపేట వరకు పలు స్టేషన్లలో ఇప్పటికే లైన్ నిర్మాణం పూర్తయింది. మిగిలిన చోట్ల కూడా పనులు వేగంగా చేపట్టి జూన్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ప్రణాళిక రూపొందించారు. కొండపల్లి – మధిర మధ్య మూడో లైన్ నిర్మాణం పనులు పూర్తిగా ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించిన విషయం విదితమే.

శరవేగంగా పనులు

మధిర నుంచి మోటమర్రి వరకు మూడో లైన్ నిర్మాణం పనులు మార్చి నాటికి, మోటమర్రి – పందిళ్లపల్లి స్టేషన్ వరకు ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యే అవకాశముంది. ఈ మార్గంలో పనులు చివరి దశలో ఉన్నాయి. ఇక పందిళ్లపల్లి – ఖమ్మం రైల్వేస్టేషన్ వరకు ఇప్పుడు శరవేగంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపాన ఇంటర్ లాకింగ్ సిస్టం పనులు సైతం జరుగుతున్నాయి. ఈ కారణంగా రైళ్ల రాకపోకల్లో ఆలస్యం జరుగుతోంది. ఇదంతా పూర్తయ్యాక ఖమ్మం – డోర్నకల్ వరకు, ఆపై మహబూబాబాద్ వరకు మూడో లైన్ నిర్మాణ పనులపై దృష్టి సారిస్తారు.

ఇంటర్ లాకింగ్‌పై దృష్టి

మహబూబాబాద్ – నెక్కొండ వరకు జరిగే పనులు ఓ కొలిక్కి వచ్చినా ఇంకా చిన్నచిన్న పనులు మిగిలిపోయాయి. ప్రతీ రెండు స్టేషన్ల మధ్య రెండు లైన్లకు తోడు మూడో లైన్ ఏర్పాటుచేస్తుండగా స్టేషన్‌లోకి వచ్చే సరికి నాలుగు లైన్లు ఉంటాయి. దీంతో కొత్త లైన్ నుంచి స్టేషన్‌లోని లైన్లకు అనుసంధానించే (ఇంటర్ లాకింగ్) పనులు నెమ్మదిగా సాగుతాయి. ఖమ్మం సమీపంలోని బర్మాషెల్ బజార్ నుంచి వెంకటగిరి గేట్ వరకు మూడో లైన్ ఇంటర్ లాకింగ్ సిస్టం పనులను ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

పనులు పూర్తయితే...

ఈ ఏడాది జూన్ నాటికి మూడో లైన్ నిర్మాణం పూర్తి చేసి రైళ్లు నడిపించాలనే యోచనలో అధికారులు ఉన్నారు. అయితే, ఏళ్ల తరబడి పనులు కొనసాగుతుండడంతో తరచుగా రైళ్లను రద్దు చేస్తుండడం, ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో మూడో లైన్ నిర్మాణంలో వేగం పెంచి త్వరగా పూర్తిచేయించడంపై దృష్టి సారించారు. కాగా, కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆలస్యంగా నడిచే అవకాశం లేకపోగా, ఉన్న రైళ్ల వేగం పెంచుతారని, ఇంకొన్ని కొత్త రైళ్లనూ ప్రారంభిస్తారని తెలుస్తోంది.

రైళ్ల రద్దు ఇందులో భాగమే

ఖమ్మం మీదుగా విజయవాడ, వరంగల్ వైపు వెళ్లే పలు రైళ్లను ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లించారు. అయితే, రద్దయిన రైళ్లలో కొన్నింటిని నిర్ణీత తేదీల్లో నడిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భద్రాచలం – విజయవాడ, డోర్నకల్ – విజయవాడ ప్యాసింజర్లు, గోల్కొండ, శాతవాహన, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే, ఖమ్మం మీదుగా నడిచే 107 రైళ్లలో 30 రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంకొన్నింటిని దారి మళ్లించనున్న నేపథ్యాన పది రోజుల పాటు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజలకు హాజరైన భక్తులు

వైభవంగా పునఃప్రతిష్ఠ

- కొత్తకళ సంతరించుకున్న వందేళ్ల నాటి ఆలయం
- వేలాదిగా హాజరైన భక్తజనం

సత్తుపల్లిటౌన్: జై శ్రీరాం.. జైజై శ్రీరాం.. లక్ష్మీరమణ గోవిందా.. అంటూ భక్తుల జయజయ ధ్వానాలు.. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సత్తుపల్లి అయ్యగారిపేటలో వందేళ్ల నాటి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. చినజీయర్ స్వామి శిష్యులు వంశీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యాన వేదపండితుల పర్యవేక్షణలో సీతారాముల విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీసీతారాములు శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ పూజలకు సత్తుపల్లి, పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో అయ్యగారిపేట కిక్కిరిసిపోయింది. సుమారు పదివేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కాగా, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కూసంపూడి మహేష్ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, బొంతు చంద్రశేఖర్, వల్లభనేని పవన్, కొల్లి నర్సింహారావు, భీమిరెడ్డి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

తిరుగులేని సంస్థ.. భారతి సిమెంట్స్



తాపీమేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రా ఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ మేనేజర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని శ్రీ భవానీ ఐరన్ సిండికేట్ షాప్‌లో శుక్రవారం జరిగిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌తో ప్రయోజనాలను ఆయన వివరించారు. అనంతరం టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని చెప్పారు. ఈ సిమెంట్ వాడే వినియోగదారులకు సంస్థ ద్వారా ఉచిత సాంకేతిక సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం 50మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువైన ఉచిత ప్రమాద బీమా బాండ్లుఅందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ రాజేష్, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ మాజీ అధ్యక్షుడు అనంతరాములుకు నివాళి



నివాళులర్పిస్తున్న మల్లు నందిని

వైరారూరల్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోదరుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతిని స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు అనంతరాములు సమాధి వద్ద నివాళులర్పించారు. నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, మదినేని రమేష్, వడ్డె నారాయణ, శీలం వెంకటనర్సిరెడ్డి, పసుపులేటి మోహన్‌రావు, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డి.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్-14, 16, 18 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

15న సేవాలాల్ జయంతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం అర్బన్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయీస్ ఫెడరేషన్(టీజీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శోభన్ నాయక్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా లచ్చునాయక్, కోశాధికారి ధరావత్ రాములునాయక్‌తో కలిసి మాట్లాడారు. జయంతి వేడుకల్లో భాగంగా ప్రతీ ఇంటిపై సేవాలాల్ జెండా ఎగురవేయాలని, ఆయన బోధనలను నేటి తరానికి తెలియచేయాలని కోరారు. కాగా, సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించడమే కాక గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా మంగ్యానాయక్, మూడ్ బాల్‌సింగ్, లూనావత్ కృష్ణనాయక్, జర్పుల భద్రునాయక్, బానోతు కిషన్, తేజావత్ మల్లానాయక్, భూక్యా దేవా, భూక్యా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సేవాలాల్ జయంతి సందర్భంగా ఈనెల 15న సెలవు ప్రకటించాలని గిరిజన ఉద్యోగ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాదావత్ శ్రీను, జాటోత్ వీరన్న ఆధ్వర్యాన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	4,350	4,350
మినుములు	7,200	6,800
మిర్చి	14,000	5,600
మిర్చి తాలు	6,500	4,600
ఏసీ మిర్చి	13,200	6,000
పత్తి	7,150	5,500

– ఖమ్మం వ్యవసాయం

'అపార్'మైన ఆలస్యం

- విద్యార్థుల సమగ్ర సమాచారంతో కార్డు..
- 12 అంకెల నంబర్ కేటాయించాలని కేంద్రం నిర్ణయం
- భద్రాద్రి జిల్లాలో 54.58 శాతం నమోదు
- ఖమ్మం జిల్లాలో 33.29 శాతానికే పరిమితం



జగన్నాథపురం హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

పాల్వంచరూరల్: విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డు రూపంలో పొందుపరిచి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు చేపట్టింది. ప్రతీ విద్యార్థికి 12 అంకెల గుర్తింపు నంబర్ కేటాయించి కార్డు అందజేయనున్నారు. ఈ నంబర్ భవిష్యత్‌లో కీలకం కానుంది. దీని ఆధారంగా విద్యార్థుల మెరిట్, విద్యార్హతలు సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అపార్ నమోదు ప్రక్రియను గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. రెండో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 31 నమోదుకు తుది గడువుగా నిర్దేశించింది. అయితే జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగింది. విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో జిల్లాలో 54.58 శాతం, ఖమ్మం జిల్లాలో 33.29 శాతం మాత్రమే అపార్ వివరాలు నమోదు చేశారు. కాగా గత నెల 31ని గడువుగా ప్రకటించినా, ఆ తర్వాత కూడా నమోదుకు అవకాశం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు.

ఆరో స్థానంలో భద్రాద్రి జిల్లా

భద్రాద్రి జిల్లాలో మొత్తం 1,692 పాఠశాలల్లో సుమారు 1,68,439 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 93,065 మంది అపార్ వివరాలు నమోదు చేయగా, ఇంకా 70,942 మంది విద్యార్థుల నమోదు జరగలేదు. మరో నాలుగు పాఠశాలల్లో అపార్ ప్రక్రియే ప్రారంభం కాలేదు. ఖమ్మం జిల్లాలో మొత్తం 1,601 పాఠశాలలు ఉండగా, 2,13,456 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 71,063 నమోదు వివరాలు నమోదు కాగా, ఇంకా 1,42,393 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. మరో పది పాఠశాలల్లో అపార్ ప్రక్రియ ప్రారంభంకాలేదు. రాష్ట్రస్థాయిలో కొత్తగూడెం జిల్లా అపార్ నమోదులో ఆరో స్థానంలో నిలవగా, ఖమ్మం జిల్లా మాత్రం 22వ స్థానంలో ఉంది.

ఇవీ ప్రయోజనాలు

అపార్ కార్డుతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు లభించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. ఏ పాఠశాలలో, కళాశాలలో ఎంత వరకు విద్యాభ్యాసం చేశారు? పరీక్షల్లో ఎన్ని మార్కులు సాధించారు? అనే వివరాలు తెలుసుకోవచ్చు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు పోగొట్టుకున్నా అపార్ నంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం



మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే అపార్ నమోదు ప్రక్రియలో భద్రాద్రి జిల్లా ముందే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉన్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించడంతో నమోదు ప్రక్రియ వేగంగా సాగింది. విద్యార్థులకు ఆధార్ కార్డులు , డేట్ ఆఫ్ బర్త్ పత్రాలు లేని కారణంగా నమోదు సమస్యగా మారింది. అపార్ నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించి లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నాం. అపార్ కార్డుతో నకిలీ విద్యార్హత పత్రాలను అరికట్టేందుకు అవకాశం ఉంది.

–వెంకటేశ్వరాచారి, భద్రాద్రి డీఈఓ

ఏపీ మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు



జగన్‌మోహన్‌రెడ్డితో నాయకులు

ముదిగొండ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లాలోని ముదిగొండ సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్త చక్రవర్తి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఇలవల వీరారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వాన పనిచేసిన మాజీ మంత్రి శైలజానాథ్ వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన నాయకులు సైతం పాల్గొన్నారు.

పాలనను గాడిన పెట్టేలా..

- ప్రత్యేక దృష్టి సారించిన కేఎంసీ కమిషనర్
- కార్యాలయంలో వివిధ విభాగాల్లో పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పరిపాలనను గాడిన పెట్టడంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలను వేగవంతం చేశారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై వరుసగా వస్తున్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన ఆయన ఒక్కో విభాగాన్ని చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఇటీవల పలువురు ఉద్యోగుల విభాగాలు మారుస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఇందులో కొందరు నూతన విభాగాల్లో చేరలేదని గుర్తించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఎంసీ కార్యాలయంలోని ఇన్‌వార్డ్, పన్నుల వసూళ్ల డెస్క్, హెల్ప్ డెస్క్‌ను శుక్రవారం తనిఖీ చేసి ఉద్యోగుల సంఖ్య, హాజరు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. రెవెన్యూ పన్నుల విభాగానికి వెళ్లిన సమయాన బిల్ కలెక్టర్ల సంఖ్యపై ఆరా తీసిన కమిషనర్ అదనంగా ఉన్న వారిని క్షేత్ర స్థాయికి పంపించాలని ఆదేశించారు. కాగా, హెల్ప్ డెస్క్‌కు కేటాయించిన ఓ మహిళా ఉద్యోగి చేరలేదని గుర్తించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫైల్ బయటకు వెళ్లడంపై ఆగ్రహం, కేసు నమోదు

మూడు రోజుల క్రితం ఇంజనీరింగ్ విభాగం నుంచి కానరాకుండా పోయిన కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఓ ఫైల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వద్ద లభించగా, ఆ ఫైల్‌ను అటెండర్ తీసి ఇచ్చినట్లు సీసీ కెమెరాల పుటేజీ ద్వారా గుర్తించారు. దీంతో అటెండర్‌ను సస్పెండ్ చేసిన కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో కేఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.కే.యాకూబ్ వలీ ఫిర్యాదు మేరకు గ్యాంగ్ కూలీ(అటెండర్) కె.రాజేశ్వరి, కాంట్రాక్టర్ హరిప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీకాంత్‌పై ఖమ్మం టు టౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది.

కార్పొరేషన్లకే విద్యుత్ బస్సులు ఇవ్వాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల కేటాయింపుల్లో మార్పులు చేయాలని, ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం కూడా ఒత్తిడి తీసుకురావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్(సీఐటీయూ అనుబంధం) ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఖమ్మం డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం రీజియన్ అధ్యక్షుడు బాణాల రాంబాబు అధ్యక్షతన 'విద్యుత్ బస్సులు- ప్రజలు, ఆర్టీసీపై ప్రభావం' అంశంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంధన ఖర్చులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్న కేంద్రం ప్రోత్సాహకాలను ఆర్టీసీకి కాకుండా కార్పొరేట్లకు సంస్థలకు దక్కేలా విధానాలు రూపొందించిందని ఆరోపించారు. దేశంలో 1.4 లక్షల బస్సులు ఆర్టీసీల పరిధిలో ఉన్నాయని, ఇప్పుడు 8లక్షల విద్యుత్ బస్సులు పెంచాలనే ప్రతిపాదన తీసుకొచ్చారని తెలిపారు. అయితే, ఈ విధానంలో ఆర్టీసీలకే లబ్ధి జరిగేల్లో విధివిధానాల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జీ.ఎస్.నారాయణ మాట్లాడుతూ విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లు, నిర్వహణ సిబ్బందిని బయటి నుంచి తీసుకుంటే ఆర్టీసీ ఉద్యోగులకు ముప్పు ఎదురవుతుందని చెప్పారు. ఈనేపథ్యాన విద్యుత్ బస్సుల విధానంపై ఎస్‌డబ్ల్యూఎఫ్ చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పిట్టల సుధాకర్, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు గుండు మాధవరావు, తోకల బాబు, నర్సింహారావు, లింగమూర్తి, సరిత, రామలక్ష్మి, విజయలక్ష్మి, ఉపేంద్రాచారి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కోటయ్య, చిన్న నర్సిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు

కారేపల్లి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ విస్మరించిందని.. దీంతో ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌రావు అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వాసి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వాంకుడోతు జగన్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరూ అడగకపోయిన పేదిళ్లలో ఆడబిడ్డల పెళ్లికి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.లక్ష సాయం అందించేవారని.. కాంగ్రెస్ మాత్రం రూ.లక్షకు తోడు తులం బంగారం ఇస్తామన్న హామీని విస్మరించిందని ఆరోపించారు. ఈసమావేశంలో నాయకులు ముత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ముత్యాల వెంకటప్పారావు, అడపా పుల్లారావు, బానోతు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

కూసుమంచి: కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ఉద్యోగుల నడుమ కొన్నాళ్లుగా నెలకొన్న విబేధాలతో పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. అంతేకాక పల్స్‌పోలియో నిధులు పక్కదారి పట్టినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు కార్యాలయ ఏఓ మోత్యా ఆధ్వర్యాన శుక్రవారం రికార్డులను తనిఖీ చేశారు. ఈ విషయమై వైద్యాధికారి కిషోర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులతో రికార్డులు పరిశీలించారని, అంతేతప్ప నిధులు పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

ఉద్యానవన పంటలు పరిశీలన



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న మధుసూదన్

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్, తల్లంపాడు, మద్దులపల్లిలో పందిరి విధానంలో సాగు చేస్తున్న కూరగాయల తోటలు, ఆయిల్‌పామ్, మామిడితోటలను జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి వి.మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణంతో ఆయా పంటలను ఆశించే తెగుళ్లు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా దీర్ఘకాలం లాభాలు సాధించొచ్చని తెలిపారు. ఉద్యానవన శాఖ పాలేరు నియోజకవర్గ అధికారి పి.అపర్ణ, రైతులు మల్లయ్య, హన్మంతరావు, రామలింగయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అనీమియాపై అవగాహన



విద్యార్థినిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

వైరా: వైరా మండలం ముసలిమడుగులోని గిరిజన సాంఘిక సాంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ అనీమియాపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రునాయక్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి దుర్గ కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేయడమే కాక అనీమియాపై అవగాహన కల్పించారు. అలాగే, పలువురు విద్యార్థినుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శిరీష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. రమణగుట్ట ప్రాంతానికి చెందిన కొట్టే ప్రవీణ్, రాపర్తినగర్‌కు చెందిన పసుపులేటి సత్యనారాయణ, గొడుగు సాయిరాం గంజాయి విక్రయిస్తున్నారనే తనిఖీలు చేపట్టి 746 గ్రాముల గంజాయి, మూడు ఫోన్లు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన యర్రనాగుల వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఆయన శుక్రవారం తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసి కాసేపటికి చూడగా కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూలికి వెళ్లొచ్చే సరికి...

చింతకాని: మండలంలోని నాగులవంచలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మేడ దివ్య – రాములు దంపతులు గురువారం ఇంటి తలుపుకు తాళం వేయకుండా గురువారం ఉదయం కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి తలుపులు తీసి ఉండడంతో పరిశీలించగా బీరువాలో దాచిన 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు దివ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మిల్లులో ధాన్యం బస్తాలు చోరీ

కల్లూరు: కల్లూరులోని శ్రీరామ రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో చోరీ జరిగింది. మిల్లును గురువారం రాత్రి 8గంటల సమయాన మూసేసి వెళ్లగా, శుక్రవారం ఉదయం వచ్చేసరికి ధాన్యం బస్తాల్లో ఆరింటిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు యజమానులు గుర్తించారు. ఈమేరకు యజమాని బండారు భద్రయ్య ఫిర్యాదుతో మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన మూడు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో ఇద్దరు వరుసకు సోదరులు కాగా ఇటీవల కన్నుమూసిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇంకో ఘటనలో శుభకార్యానికి వెళ్లొస్తున్న వ్యక్తి మృతి చెందాడు. మరో ప్రమాదంలో ఆస్పత్రికి వచ్చివెళ్తున్న రైతు కన్నుమూశాడు.

- బూడిదంపాడు వద్ద బైక్‌ను ఢీకొట్టిన బస్సు
- వరుసకు సోదరులయ్యే ఇద్దరి కన్నుమూత
- కలకోట, టేకులపల్లి వద్ద ప్రమాదాల్లో ఇంకో ఇద్దరు





భూక్యా వీరబాబు, తేజావత్ వీరబాబు (ఫైల్)

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం బూడిదంపాడు వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారులను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. మండలంలోని పువ్వాడనగర్‌కు చెందిన తేజావత్ వీరబాబు (30) లారీడ్రైవర్‌గా, ఆయన పిన్నికుమారుడు భూక్యా విజయ్(33) కూలీగా జీవనం సాగిస్తున్నారు. కారేపల్లి మండలంలో వీరి బంధువు చనిపోవడంతో శుక్రవారం బైక్‌పై పరామర్శకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమాన బూడిదంపాడు వద్ద ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్తున్న ఇల్లెందు డిపో బస్సు ఢీకొట్టింది. ఘటనలో విజయ్ బస్సు వెనక టైర్ల కింద పడగా ముఖం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, వీరబాబు కూడా మృతి చెందగా, రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ సిబ్బందితో చేరుకుని అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. విజయ్‌కు భార్య, ముగ్గురు కుమారులు, వీరబాబుకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరబాబు మొదటి భార్యకు కుమార్తె జన్మించాక ఎనిమిదేళ్ల క్రితం కన్నుమూయడంతో మరో వివాహం చేసుకున్నాడు. కుమార్తెకు పెళ్లి నిశ్చయం కాగా ఇటీవలే ముహూర్తాలు కూడా ఖరారు చేసుకున్నారు. ఇంతలోనే ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఎప్పుడూ కలిసి తిరిగి గ్రామస్తులిద్దరు ఒకేరోజు కన్నుమూయడంతో వారి బంధువులు, గ్రామస్తులు రోదనలు మిన్నంటాయి.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా..



నాగేశ్వరరావు (ఫైల్)

బోనకల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరికితీవ్ర గాయాలైన ఘటన బోనకల్ మండలం కలకోట వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని ఆళ్లపాడుకు చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు(50) ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా దుద్దిర్లపాడులో బంధువుల ఇంట శుక్రవారం జరిగిన శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. బోనకల్ నుంచి మధిర వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం కలకోట వద్ద ఆయన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తాళ్లూరి నాగేశ్వరావు అక్కడికక్కడే మృతి చెందగా ఇంకోవాహనంపై ఉన్న పృథ్వీరాజ్, నరేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో రైతు..

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన ఖమ్మంలోని టేకులపల్లి బ్రిడ్జి సమీపాన శుక్రవారం జరిగింది. చింతకాని మండలం రాఘవపురానికి చెందిన రైతు దొబ్బల మురళి(65) కంటి ఆస్పత్రిలో చూపించుకుని సాయంత్రం బైపాస్ మీదుగా తిరిగి వెళ్తున్నాడు. టేకులపల్లి బ్రిడ్జి సమీపాన ఆయన ద్విచక్రవాహనాన్ని ఎదురుగా, వేగంగా వచ్చిన బొలెరో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు వెంకటరమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టుటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

పెనుబల్లి: మండలంలో శుక్రవారం చోటు చేసుకున్న రెండు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండాలపాడుకు చెందిన రావిలాల పవన్‌సాయి తన చెల్లెలి స్కూల్ బస్సు వెళ్లిపోవడంతో ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి లంకపల్లిలో బస్సు ఎక్కించాడు. అక్కడి నుంచి ఇంటికి వస్తుండగా గ్రామశివారులో ఖమ్మం వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టగా పవన్‌సాయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు పెనుబల్లిలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అలాగే, పెనుబల్లికి చెందిన వేముల కృష్ణయ్య పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా పెనుబల్లి వద్ద జాతీయ రహదారిపై కొత్తగూడెం నుండి తిరువూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడైన కృష్ణయ్యకు గాయాలు కావడంతో పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు.

టిప్పర్ లారీ బోల్తా

మధిర: మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం టిప్పర్ లారీ బోల్తా పడింది. రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులకు మట్టి తీసుకొస్తున్న టిప్పర్ బ్రిడ్జి వద్ద భగీరథ పైప్‌లైన్ మరమ్మతులకు తవ్విన గోతిలో పడడంతో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చింతకాని: మండలంలోని నాగులవంచలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గ్రామ సమీప చెరువు కట్టపై పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.